

# మహిళా సాధికారతకు పెద్దపీట వేసినం

**మహిళలే కేంద్రంగా పథకాలు అమలు చేసినం**

**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్**

**ఆడబిడ్డలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మహిళలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్త్రీశక్తిని కొనియాడారు. కుటుంబ వ్యవస్థను ముందుకు నడపడంలో మహిళల త్యాగం మహోన్నతమైనదని పేర్కొన్నారు. దేశ సంపదను సృష్టించడంలో వారి పాత్ర గొప్పదని తెలిపారు. అనేక కష్టాలను అధిగమిస్తూ పురుషుడితో సమానంగా నేటి సమాజంలో స్త్రీ పోశిస్తున్న పాత్ర అమోఘమని అభివర్ణించారు. అవకాశాలిస్తే అబల సబలగా నిరూపించుకుంటుందని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మహిళల అభ్యున్నతి కోసం అమలు చేసిన పలు కార్యక్రమాలు, వారి సాధికారతకు దోహదం చేశాయని గుర్తుచేశారు. మహిళల ఆరోగ్యం, సంరక్షణ, సంక్షేమంతో పాటు పలు కీలక అభివృద్ధి పథకాల్లో మహిళకే ప్రాధాన్యతనిచ్చామని, వారి కేంద్రంగానే పథకాలను అమలు చేశామని, తెలంగాణ ప్రగతిలో మహిళలను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం భాగస్వామ్యం చేసిందని పేర్కొన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మహిళాసాధికారతకు ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. వారిని మరింత శక్తిమంతంగా తీర్చిదిద్దితేనే తెలంగాణ అభివృద్ధి పథాన పయనిస్తుందని సూచించారు.



శనివారం తెలంగాణ భవన్‌లో మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు

# మహిళా రిజర్వేషన్ ఏది?

- **జనగణనతో కేంద్రం ముడిపెట్టొద్దు**
- **కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి**
- **మహిళలకు 2,500 ఇవ్వాల్సిందే**
- **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**
- **తెలంగాణభవన్‌లో ఉమెన్స్ డే వేడుకలు**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): జనగణనతో ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2023లో పార్లమెంటు ఆమోదించినా జనగణనతో ముడిపెట్టి కేంద్రం ఇప్పటికీ దీనిని అమలు చేయడం లేదని తెలిపారు. దీంతో దేశవ్యాప్తంగా మహిళలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ కారణంగా ఇటీవల ఎన్నికలు జరిగిన మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా వంటి రాష్ట్రాల్లో చాలా మంది మహిళలు ఎమ్మెల్యేలు కాలేకపోయారని, ఇప్పటికైనా త్వరితగతిన జనగణన చేస్తే బీహార్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మరింత మంది మహిళలకు అవకాశాలు దక్కుతాయని స్పష్టంచేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకలకు కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి అర్పించారు. ఈ సందర్భంగా స్వరవల్లరి తెలుగు గజల్ అకాడమీ ఆధ్వర్యంలో రూపొందించిన 'వనితా అంతరంగం-మహిళలకు గజల్ నీరాజనం' అనే ఆడియో సీడీని కవవిత ఆవిష్కరించారు. అనంతరం పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సంవర్భంగా కవిత మాట్లాడారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీని రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ హామీని అమలుచేసే వరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు. అంగన్‌వాడీలు, ఆశావర్కర్లకు వెంటనే రాష్ట్రప్రభుత్వం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

### అతివలకు ఆతిథ్యమివ్వడం అదృష్టం

సమాజంలో అసమానతలు ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్న మహిళలకు మహిళా దినోత్సవం సందర్భంగా అతిథ్యమివ్వడం అదృష్టమని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. అతివల విజయాలనే కాకుండా వారి ధైర్యసాహసాలను గుర్తుచేసుకోవడం ఆనందంగా ఉన్నదని తెలిపారు.



తెలంగాణ భవన్‌లో 'వనితాంతరంగం' గజల్ సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

> సమాజం ఎదుగుదలలో మహిళల పాత్ర గణనీయం. మహిళలకు సమాన హక్కులు, గౌరవం, నిర్ణయాధికారం రావాలి. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. చిట్యాల ఐలమ్మ, రాణి రుద్రమదేవి వంటి వీరనారీమణులు తెలంగాణ గడ్డపై పుట్టడం మనకు గర్వకారణం. మహిళలకు కులమతాలు లేవు. అంతా ఒకే కులం. మహిళలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలి.
>
> **- కల్వకుంట్ల కవిత**

### కేసీఆర్‌ది మహిళా కేంద్రీకృత పాలన

బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ మహిళా కేంద్రీకృత పాలన చేశారని, మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు చేపట్టారని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు. కేసీఆర్ పెట్టిన పథకాలను తీసేసే దిక్కుమాలిన ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్నదని ధ్వజమెత్తారు. కేరళ ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో మహిళల, పురుషుల సమానత్వపు బొమ్మలు ప్రచురిస్తున్నారని, అలాంటి చర్యలు తెలంగాణలో కూడా రావాల్సి ఉన్నదని చెప్పారు. మహిళలు ద్వితీయశ్రేణి పౌరులుగా ఉంటున్నారన్న అభిప్రాయం పోవాలని ఎమ్మెల్సీ కవిత అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ మహిళా నేతలు గండ్ర జ్యోతి, ముక్తవరం సుశీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోకం పోకడ




**మీరేం వర్రీకాకండి సార్.. అన్ని ఫైళ్లను ఒక పెద్ద ఫైల్‌లో కుక్కేశా.. ఇప్పుడున్నది ఒకే పెండింగ్ ఫైల్!**

# ఆర్ఆర్ ట్యాక్స్‌తోనే పరిశ్రమలు వెనక్కి

**ఎక్స్ వేదికగా కేటీఆర్ ఫైర్**



హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్‌తోనే పరిశ్రమలు వెనక్కి వెళ్తున్నాయని, పెట్టుబడిదారులు తెలంగాణను కాదని గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. ఈ విషయంలో ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ పెట్టుబడులకు అయస్కాంతంలా పని చేసిందని, ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రానికి వరుసకట్టాయని పేర్కొన్నారు.

# రక్తహీనతతో బాలింత మృతి

**మహిళా దినోత్సవం రోజే ఆదిలాబాద్ జిల్లాలో ఘటన**

**కేసీఆర్ కిట్ లేక.. పోషకాహారం అందక మరణం**

**రేవంత్ పాలనలో కిట్ నిలిపివేసిన ప్రభుత్వం**

ఆదిలాబాద్, మార్చి 8(నమస్తే తెలంగాణ) : మహిళా దినోత్సవం రోజునే ఓ బాలింత రక్తహీనతతో మృతి చెందడం పలువురిని కలిచివేసింది. ఆడబిడ్డలకు సంక్షేమ పథకాలతో అండగా ఉండాల్సిన ప్రభుత్వమే వాటిని నిలిపివేసి వారి పాలిట శాపంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన న్యూట్రిషన్ కిట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడంతో పౌష్టికాహారం అందక కూలీ పనులు చేసుకునే ఓ పేదింటి ఆడబిడ్డ రక్తహీనతతో కన్నుమూసింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని లక్కారంలో కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందే గర్భిణి అత్రం శ్రీ విద్య(23) పౌష్టికాహార లోపం ఫలితంగా రక్తహీనత సమస్యతో బాధపడుతున్నది. 40 రోజుల కిందట ప్రసవం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌లో చేరింది. ప్రసవ సమయంలో దవాఖానలో రక్తం ఎక్కించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. రక్తహీనత కారణంగా తీవ్ర అనారోగ్యం బారిన పడిన శ్రీవిద్య మహిళా దినోత్సవం రోజైన శనివారం ఉదయం మరణించింది. దీంతో 40 రోజుల శిశువు అనాథగా మారిందని బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

### సంక్షేమ పథకాలను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

గర్భిణులకు పౌష్టికాహారం అందించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకాన్ని అమలు చేసింది. ఈ కిట్‌లో కిలో న్యూట్రిషన్ మిల్క్ పౌడర్, కిలో ఖర్జూర పండ్లు, మూడు బాటిళ్ల ఐరన్ సిరప్‌తోపాటు, అర కిలో నెయ్యి ఉంటాయి. ఈ కిట్‌లను రెండు విడతలుగా అందించింది. దీంతో గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం పెరగడంతోపాటు రక్తహీనత సమస్యకు పరిష్కారం లభించింది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో మాతా, శిశు మరణాల రేటు తగ్గించడానికి ఈ కిట్ ఎంతగానో ఉపయోగపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఈ పథకాన్ని నిలిచి వేసింది. దీంతో గర్భిణులకు 14 నెలలుగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందకపోవడంతో పోషకాహారం లభించడం లేదు. ప్రస్తుతం ఈ పథకం నిలిచిపోవడంతో మరణాలు సంభవిస్తున్నాయి.

# హైదరాబాద్‌లో డయేరియా దడ!

**అడుగంటిన భూగర్భ జలాలు, తాగునీటి కాలుష్యం**

**ఒక్క ఫీవర్ దవాఖానలోనే 21 మంది బాధితులు**

**జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్య నిపుణులు**

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో అతిసార(డయేరియా) కేసులు పెరుగుతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు పలు దవాఖానలకు పరుగులు పెడుతున్నారు. సిటీలోని ఫీవర్ దవాఖానకు రోజుకు 30 మంది బాధితులు వస్తున్నారు. వీరిలో రోజుకు ఆరుగురు అడ్మిట్ అవుతున్నారు. ప్రస్తుతం దవాఖానలో 21మంది బాధితులు చికిత్స పొందుతున్నారని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో డయేరియాకు దారి తీసే పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఎండలు ముదరడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో భూగర్భ జలాలు 1.44 మీటర్ల మేరకు తగ్గిపోయినట్టు నిపుణులు చెప్తున్నారు. జలవనరుల్లో నీటి నిల్వలు లేకపోవడం, భూగర్భజలాలు పడిపోవడంతో తాగునీరు కలుషితమవుతున్నట్టు వెల్లడించారు. రోజూ 4 లీటర్ల నీటిని తాగితే డయేరియా బారినపడకుండా ఉండవచ్చని ఫీవర్ దవాఖాన జనరల్ ఫిజిషియన్ విజయ్ సూచించారు.




తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

# ఏం సాధించారని సర్కారు గొప్పలు?

- **పత్రికలకు పెద్ద పెద్ద ప్రకటనలు ఇచ్చి ప్రజాధనం దుర్వినియోగం చేయొద్దు**
- **మహిళలకు ఇస్తామన్న 2,500 ఏమైంది?**
- **మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత నిలదీత**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ):15 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సాధించిందని మహిళా శక్తి పేరిట పత్రికలకు పెద్ద పెద్ద ప్రకటనలు ఇచ్చి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికల వేళ మహిళలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ తర్వాత వాటిని మరిచిపోయిందని విమర్శించారు. ఆర్థిక పరిస్థితి బాగాలేదని సీఎం చెప్తున్నారని, ఈ విషయం హామీలు ఇచ్చినప్పుడు తెలియదా? అని నిలదీశారు. తెలంగాణ భవన్‌లో శనివారం బీఆర్ఎస్ మహిళా నేతలు తుల ఉమ, సుశీలారెడ్డి, నందిని బాలారెడ్డి, ఖుషి సమ్ము, లింగాల శోభారాణితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో మహిళా సంక్షేమం కొరవడిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏం సాధించిందని పరేడ్ గ్రౌండ్స్‌లో సభ పెట్టిందని ప్రశ్నించారు. మహిళల కోసం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాలు రేవంత్ పాలనలో నిర్వీర్యమయ్యాయని మండిపడ్డారు. ఉచిత బస్సు పథకాన్ని గొప్పగా చెప్తున్నారని, కానీ బస్సుల సంఖ్య తగ్గించారని ధ్వజమెత్తారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ 20-25 శాతం మందికి కూడా అందడం లేదని మండిపడ్డారు. మహాలక్ష్మి పేరిట మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఏమైందని నిలదీశారు.

### హక్కుగా సాధించుకోవాలి: తుల ఉమ

పురుషాధిక్య సమాజంలో రాణించాలంటే అడుక్కోవడం కాదు.. హక్కుగా సాధించుకోవాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ పిలుపునిచ్చారు. అవనిలో సగం, ఆకాశంలో సగం ఉన్న మహిళలకు అవకాశాలు తక్కువ వస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయాల్లో మహిళలకు ఎక్కువ అవకాశం కల్పించాలని, చట్టసభల్లో సగం సీట్లు కేటాయించాలని కోరారు.

# సీఎం నిర్బంధపు స్పీచ్?

- **పరేడ్ గ్రౌండ్ గేట్లకు పోలీసుల తాళాలు**
- **వెళ్లకుండా అడ్డుకోవడంపై మహిళల ఆగ్రహం**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి నిర్వహించిన బహిరంగ సభలో తమకు జరిగిన తీవ్ర అవమానంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరేడ్‌గ్రౌండ్ గేట్లకు తాళాలు వేసి, మహిళలను నిర్బంధించి మరీ ముఖ్యమంత్రి స్పీచ్ వినిపించడంపై పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన భారీ బహిరంగసభ ఆలస్యం అవుతుండటం, ముఖ్యమంత్రి సైతం కార్యక్రమానికి ఆలస్యంగా రావడంతో మహిళలు తమ ఇండ్లకు వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పీచ్ ప్రారంభమైన తర్వాత, అప్పటికే సమయం మించిపోతుండటంతో కొందరు మహిళలు తమ ఇండ్లకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు పరేడ్‌గ్రౌండ్‌కు తాళాలు వేసి ఓవరాక్షన్ చేశారు. ఎంతకీ గేట్ల తాళాలు తీయకపోవడంతో మహిళలు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో 'సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ముగిస్తేనే పంపిస్తాం' అంటూ అక్కడున్న పోలీసులు తెగేసి చెప్పడంతో వారి కోపం మరింత కట్టలు తెంచుకుంది. 'యూ యూజ్ లెస్ ఫెల్లోస్.. ఇంట్లో మగాళ్లు అందరూ ఒకే తీరుగా ఉంటారా? ఇదేం కార్యక్రమం.. ఇళ్లకు పోవాలంటే పోనివ్వరా? ఇంటి దగ్గర చిన్న పిల్లలు ఉన్నారు.. వాళ్లు ఇబ్బందులు పడుతున్నారు' అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ఏదో మంచి కార్యక్రమం అని వచ్చినందుకు మాకు బాగానే జరిగింది' అంటూ మరో మహిళ ఆగ్రహించారు. 'మేం వెళ్లిపోవాలి, మమ్మల్ని వదిలేయండి' అంటూ మరో మహిళ వేడుకున్నది. ఈ వీడియో సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో.. అటు సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై, పోలీసుల ఓవరాక్షన్‌పై నెటిజన్లు సైతం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు.



బయటకు వెళ్లకుండా పరేడ్‌గ్రౌండ్ గేట్లకు తాళాలు వేసి అడ్డుగా నిల్చున్న పోలీసులు

# నేనూ కాంగ్రెసోన్నే

I తరువాయి...

లింగారెడ్డి. ఉబికి వస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూ గద్గదస్వరంలో ఇలా కుండబద్దలు కొట్టాడు. నీళ్లు పారని ఎస్సారెస్పీ కాలువలు, ఎండిన పంట పొలాలను పరిశీలించేందుకు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌తో కలిసి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నూతనకల్ మండలంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వారి ఎదుట లింగారెడ్డి తన సమస్యలను ఇలా ఏకరువు పెట్టారు.

### అప్పుడు యాసంగిలోనూ నీళ్లు పారినయ్

'కేసీఆర్ ఉన్నప్పుడు యాసంగిలోనూ శనగ చేన్లలో నీళ్లు పారినయ్. పొలాలు పారినయ్.. ఈ యేడు వానకాలం నీళ్లు రాలె. యాసంగి రాలె. కాంగ్రెస్ సర్కార్ వచ్చి 14 నెలలు అవుతున్నది. 14 సంవత్సరాల కరువు తెచ్చింది. నాకు ఎస్సారెస్పీ కాలువకు రెండు పక్కలా ఏడెకరాల భూమి ఉంది. ఓ పక్క మూడెకరాలు, ఇంకోపక్క రెండెకరాలు ఎండిపోయింది. నేను మూడు బోర్లు వేసిన. రూ.1.50 లక్షల ఖర్చయింది. 200 అడుగులు తవ్వినా బోర్లు పడలేదు. గొడ్లకు కూడా నీళ్ల కరువైంది. ఈ ఏడాది నీళ్లు కండ్లజూడలే. నిరుడు దాకా కేసీఆర్ అప్పుడు పంట ఎండిందన్న రైతు లేడు. ఈ యేడు రైతులంతా బోరుబోరున ఏడుస్తున్నరు. ఈ సర్కారు వచ్చినప్పటి నుంచి ఇబ్బంది పడుతున్నం. మూడుసార్లు ఎర్రపాడు ఎక్స్‌రోడ్డులో, సూర్యాపేటలో సీఈ ఆఫీసుకు పోయి నీళ్ల కోసం ధర్నా చేసినం. ఎవరూ పట్టించుకోలే. మా ఎమ్మెల్యే సామేలు సుక్క నీళ్లు కూడా రావంటడు అట. ఎనిమిదేండ్లు ప్రభుత్వం ఏలిండు కేసీఆర్. ఏదో మార్పు వస్తది అంటే కాంగ్రెస్‌కు ఓట్లేసినం. ఓట్లేసినందుకు రైతు రెండు చెంపలు వేసుకుంటున్నడు' అంటూ దుఃఖం దిగమింగుతూ దుమ్మెత్తి పోశాడు కాంగ్రెస్ అభిమాని, నూతనకల్ రైతు సాబాది మల్లారెడ్డి.

### కాలువ నీళ్లను నమ్మి కౌలు పట్టిన

పంటలు ఎండుతున్నయని జగదీశ్‌రెడ్డి, గాదరి కిశోర్ ఎదుట దిర్శినపల్లికి చెందిన కౌలు రైతు గంట వీరస్వామి ఆవేదన వ్యక్తంచేశారు. 'మా ఊరికి కాలువ నీళ్లు వస్తయని నమ్మి 15 ఎకరాల భూమి కౌలుకు పట్టిన. 14 ఎకరాలు వరి, ఒక ఎకరంలో మిర్చి సాగు చేసిన. మూడు బోర్లు, రెండు బావులు ఉండే. కాలువలోకి చుక్కనీరు వదల్లేదు. బోర్లల్లో నీళ్లు తగ్గిపోయినయ్. ఇప్పటికే 8 ఎకరాల వరి పొలం, మిర్చి ఎండింది. కుటుంబమంతా దీనిపైనే ఆధారపడ్డం. 8 లక్షలు పెట్టుబడి పెట్టినం. ఇప్పుడు ఏం చేయాలో తోస్తలేదు. కాలువలోకి నీళ్లొస్తేనే పంటలు గట్టెక్కుతయి. లేదంటే పెట్టుబడి ఎట్లెల్లాలో?కౌలు ఎట్ల కట్టాలో? అర్థమైతలేదు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎప్పుడూ ఇట్ల కాలేదు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే ఇల్లు మునిగే పరిస్థితి వచ్చింది' అని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులను ఏ రైతును కదలించినా కాంగ్రెస్ సర్కారుపై దుమ్మెత్తి పోస్తున్నారు. పక్కా కాంగ్రెస్ కార్యకర్తలైన రైతులు కూడా ఇలా తమ ఆవేదనను వ్యక్తంచేస్తున్నారు. ఎండుతున్న పంటలను చూసి కంటతడి పెడుతున్నారు. 'నేను పదెకరాల పొలం పెట్టిన. ఇందులో ఇప్పటికే ఐదెకరాలు ఎండింది. ఆ ఎండిన పొలంలో పశువులను మేపుతున్న. మిగతా పొలం కూడా చేతికొస్తదో? లేదో? కూరగాయల తోట వేస్తే అదికూడా ఎండింది. కేసీఆర్ ఉన్నప్పుడు ఈ పొలమంతా పారింది. నీళ్లు పుష్కలంగా వచ్చినయ్. ఇప్పుడు గూడ గట్లనుకునే అని పొలం పెడితే అంతా ఎండిపోతున్నది. 5 లక్షలు పెట్టుబడి పెట్టిన. ఏం చేయాలో అర్థమైతలేదు' అంటూ ముఖానికి రుమాలు అడ్డుపెట్టుకొని విలపిస్తూ నూతనకల్‌కు చెందిన రైతు బండారి కృష్ణారెడ్డి బాధను వెళ్లగక్కారు. 'నాలుగెకరాల పొలం పెట్టిన. రెండెకరాలు ఎండింది. కాంగ్రెస్ నీళ్లిస్తలేదు' అని ది వ్యాంగ రైతు ఇమ్మరెడ్డి నవీన్‌రెడ్డి విచారం వెలిబుచ్చారు.

### కాళేశ్వరం కేసీఆర్‌కు అప్పజెప్తే మూడోరోజే నీళ్లిచ్చి చూపిస్తం: జగదీశ్‌రెడ్డి, గాదరి

ఇవ్వాళ కేసీఆర్ చేతికి కాళేశ్వరం ప్రాజెక్టును అప్పజెప్తే మూడో రోజే ఎస్సారెస్పీ కాలువలకు నీళ్లిచ్చి చూపిస్తమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, గాదరి కిశోర్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఎండిన పంట పొలాలను పరిశీలించిన అనంతరం వారు నూతనకల్ మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీమణి పద్మావతీ ప్రాతినిథ్యం వహిస్తున్న మోతె మండలంలోని చివరి గ్రామంలోని చివరి ఎకరా వరకు నీళ్లిచ్చి తీరుతామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఏమీ కాలేదని, కన్నెపల్లి పంప్‌హౌస్ ఆన్ చేస్తే కాలువల్లో నీరు పారుతుందని తెలిపారు. నీళ్లిస్తే కాళేశ్వరం బానే ఉన్నదని ప్రజలు భావిస్తారన్న కుట్రతోనే ఇవ్వడం లేదని విమర్శించారు. సీఎం, మంత్రుల బుర్రలకు పుండు పుట్టే, ఇక్కడి పంటలను ఎండబెడుతున్నారని మండిపడ్డారు. డీబీఎం 69 కింద ఒక్కసారి కూడా నీళ్లు ఇవ్వలేదని, ఎందుకు నీళ్లు పారడం లేదో నీటిపారుదల శాఖ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉత్తమ్ చెప్తున్న ప్రతి మాటా అబద్ధమేనని, అందుకు ఎండుతున్న పంటలే నిదర్శమని చెప్పారు. కాళేశ్వరాన్ని అడ్డుపెట్టుకొని కేసీఆర్‌పై చేస్తున్న కుట్రలను ఆపి ఎస్సారెస్పీకి నీళ్లిచ్చి రైతులను ఆదుకోవాలని జగదీశ్‌రెడ్డి, గాదరి కిశోర్ డిమాండ్ చేశారు.



కేసీఆర్ ప్రభుత్వ హయాంలో న్యూట్రిషన్ కిట్లతో గర్భిణులు (ఫైల్)

# అబద్ధపు మాటలు... తప్పుడు లెక్కలు

- **మహిళా సంక్షేమంపై రేవంత్ అడ్డగోలు వ్యాఖ్యలు**
- **కేసీఆర్ ప్రభుత్వం ఏమీ చేయలేదంటూ విమర్శలు**
- **కేసీఆర్ పాలనలోనే మహిళలకు మేలు జరిగిందని గుర్తుచేసుకుంటున్న స్వయం సహాయక సంఘాలు**
- **కాంగ్రెస్ మభ్యపెడుతున్నదని విమర్శలు**
- **సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు వల్లించారు**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు, ప్రకటనలపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం హోదాలో ఉండి అడ్డగోలుగా అబద్ధాలు చెప్పారంటూ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు మండిపడుతున్నారు. ఎన్నికల్లో మహాలక్ష్మి పేరుతో గ్యారెంటీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అటకెక్కించారని నిప్పులు చెరుగుతున్నారు. సీఎం చెప్పిన మాటల్లో తప్పులను ఒక్కొక్కటిగా వివరిస్తూ మహిళా సంఘాల నేతలు దుమ్మెత్తిపోస్తున్నారు. కేసీఆర్ హయాంలో మహిళా సంఘాలకు మూడు విడుతలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆదుకున్నారని తెలంగాణ మహిళా సంఘాల ప్రతినిధి సునీత స్పష్టంచేశారు.

### మహిళలకు కేసీఆర్ ఇచ్చిన వరాలు

- 70 వేల ఎస్‌హెచ్‌జీల ద్వారా 7 లక్షల మందికి వడ్డీ లేనిరుణాలు
- పదేండ్లలో మూడు విడుతల్లో రూ.30 వేల కోట్ల వరకు వడ్డీలేని రుణాలు
- సెర్ప్, మెప్మా కలిపి 7 లక్షల మంది మహిళలకు లబ్ధికలిగించిన కేసీఆర్
- తనఖా లేకుండానే ఒక్కో గ్రూపునకు రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరు
- మహిళా సాధికారత... సమగ్రాభివృద్ధి
- మెప్మా ఆర్పీలకు రూ.6000 వరకు, వీవోఏలకు రూ.5000 వరకు జీతాల పెంపు
- మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దిన బీఆర్ఎస్ సర్కారు
- మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.3000 వేతన విధానం, 54,000 మంది కార్మికులకు లబ్ధి
- స్కూల్ యూనిఫారాలు కుట్టే బాధ్యతలు పద్మశాలీ మహిళలకే అప్పగింత
- బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో ప్రతీగ్రామంలో మహిళా భవనాల ఏర్పాటు
- ఆర్పీలకు రూ.6000, వీవోలకు రూ.5000 వరకు వేతనాల పెంపు
- అదనంగా వీవోఏలకు రూ.900 వరకు పీఆర్సీ ఇచ్చిన కేసీఆర్ సర్కారు
- అంగన్‌వాడీల్లో రెండు సార్లు నియామకాలు
- ఎస్‌బీఐ, యూబీఐ ద్వారా మహిళలకు రూ.5,900 కోట్ల లావాదేవీలు
- 964 గ్రామాల్లో మహిళలు గరిష్ఠంగా రూ.60 వేలు సంపాదించుకునే వెసులుబాటు

### కేసీఆర్ పాలనలో మహిళా సంక్షేమ పథకాలు

- బాలికల కోసం ప్రత్యేక గురుకులాలు
- యువతులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు
- మహిళల ఆరోగ్య పరీక్షల కోసం 'ఉమెన్ క్లినిక్'లు
- ఆడబిడ్డల పెండ్లికి కళ్యాణలక్ష్మి/షాదీముబారక్
- గర్భిణులకు అమ్మఒడి వాహనం ద్వారా దవాఖానలకు ఉచిత రవాణా సదుపాయం
- గర్భిణులకు న్యూట్రిషన్ కిట్, ఆరోగ్యలక్ష్మి
- బాలింతలకు కేసీఆర్ కిట్
- బీడీ కార్మికులకు పింఛన్
- ఒంటరి మహిళలు, వితంతువులకు పింఛన్

### కాంగ్రెస్ వచ్చింది.. పథకాలు ఆపింది

కేసీఆర్ ప్రభుత్వం మహిళల కోసం అమలు చేసిన పథకాలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిపివేసిందని మహిళా సంఘాల నేతలు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మరిచిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్యాణలక్ష్మి కింద అదనంగా తులం బంగారం ఇస్తారన్నారని, ఇంతవరకు అతీగతీ లేదని విమర్శిస్తున్నారు. పింఛన్ల పెంపు ఊసేలేదని, రూ.2,500 పథకం, స్కూటీల పంపిణీ ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు.

| రేవంత్‌రెడ్డి ప్రకటన | మహిళల ప్రతిఘటన |
| --- | --- |
| జిల్లా కేంద్రాల్లో రూ.25 కోట్లతో మహిళా శక్తి భవనాలు | కేసీఆర్ హయాంలోనే 40 భవనాల నిర్మాణం |
| ఏడాదిలోనే రూ.21 వేల కోట్ల రుణాల మంజూరు | బ్యాంకుల ద్వారా పొందిన రుణాలు మాత్రమే |
| మహిళా యూనివర్సిటీకి చాకలి అయిలమ్మ పేరు | మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేసిందే కేసీఆర్ |